క్లుప్తంగా

అభినందనీయం


ప్రవీణ్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

దేవరుప్పుల: ఆధ్యాత్మిక చింతన కోసం దాతల తోడ్పాటు అభినందనీయమని గ్రామస్తులు అన్నారు. ఆదివారం గొల్లపల్లికి చెందిన బూరుగు ప్రవీణ్ గ్రామాభివృద్ధి తోడ్పాటులో భాగంగా స్థానిక ముత్యాలమ్మ ఆలయానికి రంగులు వేయించి దేవతామూర్తుల చిత్రపటాలను ఆర్టిస్టుతో వేయించడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామస్తులు ప్రవీణ్‌ను అభినందించి ఘనంగా సత్కరించి ప్రత్యేక అభినందనలు తెలిపారు. కడారి అంజయ్య యాదవ్ బట్ట యాదగిరి బట్ట బలరాములు, కొండయ్య సైదులు, పరశురాములు, వంగాల మల్లయ్య పాల్గొన్నారు.

హెల్పింగ్‌హ్యాండ్స్ సేవలు..



చిల్పూరు: పేదల కోసం హెల్పింగ్ హాండ్స్ సొసైటీ సభ్యులు చేస్తున్న కృషి అభినందనీయమని రైతు నేస్తం కో ఆర్డినేటర్ కేశిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి అన్నారు. మల్కాపూర్ గ్రామంలో ఆదివారం హెల్పింగ్ హాండ్ సొసైటీ సహకారంతో గ్రామానికి చెందిన ఊరడి సింధు, మహ్మద్ అశ్రలు ఇటీవల 10వ తరగతిలో అత్యధిక మార్కులతో బాసరలో సీటు సాధించగా వారికి ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం అంకం పరందాములు అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబానికి బియ్యంతో పాటు ఆర్థికసాయం అందజేశారు. శ్రీనివాస్, ప్రవీణ్, రమేష్, రాజు పాల్గొన్నారు.

ఎన్నిక


సందీప్, అధ్యక్షుడు

పాలకుర్తి టౌన్: మండల కేంద్రంలోని శాంతినగర్ క్రాంతి యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణపతి, దుర్గామాత నవరాత్రి ఉత్సవాల నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బొద్దున సందీప్, ఉపాధ్యక్షుడిగా బెల్లి దిలీప్, ప్రధాన కార్యదర్శిగా గజ్జి సంతోష్, సహాయ కార్యదర్శిగా ముత్తోజు రాము, కోశాధికారిగా బండి యకన్న, చిట్యాల మధు, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

పరామర్శ



లింగాలఘణపురం: మండలంలోని క్లాం పీఏసీఎస్ చైర్మన్ ఉపేందర్ తండ్రి నర్సయ్య గుండెపోటుతో మృతి చెందాడు. కాగా, ఆదివారం ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి అండగా ఉంటామని అన్నారు. ఎమ్మెల్యేతో పాటు మాజీ జెడ్పీటీసీ వంశీధర్‌రెడ్డి, పార్టీ మండలఅధ్యక్షుడు శివకుమార్, దేవస్థాన చైర్మన్ మూర్తి, నాయకులు శ్రీనివాసురెడ్డి, గణపతి, ఆంజనేయులు, రమేష్, కుమార్, బాలరాజు, శ్రీనివాసు, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మబ్బు యాదమ్మ అనారోగ్యంతో మృతి చెందగా మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

సన్మానం



పాలకుర్తి: పాలకుర్తి పోలీస్‌స్టేషన్‌లో రైటర్‌గా పనిచేస్తున్న మహిళా కానిస్టేబుల్ ప్రశాంతి బదిలీపై వెళ్తుండగా ఆదివారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రశాంతి దంపతులను ఎస్సై లింగారెడ్డి ఘనంగా సన్మానించారు.

దరఖాస్తుల ఆహ్వానం

బచ్చన్నపేట: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల బాలికల హాస్టల్‌లో ఏఎన్‌ఎం ఔట్ సోర్సింగ్ ఉద్యోగానికి మహిళల నుంచి దరఖాస్తు ఆహ్వానిస్తున్నట్లు కేజీబీవీ స్పెషలాఫీసర్, హాస్టల్ ఇన్‌చార్జ్ నారమల్ల గీత తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ కేజీబీవీకి అటాచ్‌గా ఉన్న ఆదర్శ పాఠశాల గర్ల్స్ హాస్టల్‌లో మహిళా ఏఎన్‌ఎం పోస్టు ఖాళీగా ఉందన్నారు. ఇంటర్ పూర్తి చేసి ఏఎన్‌ఎం శిక్షణ పొందిన వారు మాత్రమే అర్హులు అన్నారు. 24 గంటలు విద్యార్థినులతో ఉండాలని నెలకు రూ.7,800ల వేతనం ఇస్తారని అన్నారు. ఆసక్తి గల వారు ఈ నెల 12 లోపు దరఖాస్తు చేసుకోవాలని, అవసరమైతే 9866379272 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

మూతపడిన ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు షెడ్

- రెండేళ్ల ధరలతో పదేళ్లుగా..
- అడ్డగోలు నిబంధనలు.. గత్యంతరం లేని పరిస్థితుల్లో మూసివేత
- రైతులకు ఇబ్బందులు


సమ్మెతో మూతపడిన ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు షెడ్డు

జనగామ: జనగామ టీఎస్ ఎన్పీడీసీఎల్ పరిధిలో కొనసాగుతున్న ప్రైవేట్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు షెడ్డు మూతపడింది. రెండేళ్ల కోసం ఇచ్చిన ధరలతో పదేళ్లుగా కొనసాగిస్తూ నష్టపోతున్నా పట్టించుకోకపోవడంతో రాష్ట్ర వెల్ఫేర్ అసోసియేషన్ ఈ నెల10 నుంచి సమ్మెకు వెళ్తున్నట్లు పిలుపునిచ్చింది. దీంతో జనగామలోని ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు షెడ్డు ఆదివారం క్లోజ్ కావడంతో రైతులకు ఇబ్బందులు తప్పేలా లేదు. వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా ఇన్‌చార్జ్ కె.తిరుమల్‌రెడ్డి మాట్లాడుతూ టీఎస్ఎన్పీడీసీఎల్ సంస్థలో గత 10 సం వత్సరాలుగా ప్రైవేట్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు పనులు చేయడం జరుగుతుందన్నారు. నాడు రెండు సంవత్సరాల కోసం ఇచ్చిన ధరలతో ఎంత నష్టం జరిగినా, పదేళ్లుగా రిపేరు చేస్తూ వస్తున్నామన్నారు. కరోనా సమయంలో సైతం పనులకు ఆటంకం కలుగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటూ ముందుకు వెళ్లామే తప్ప, రైతులకు ఇబ్బంది కలిగించ లేదన్నారు. కరోనా తరువాత ముడిసరుకుల ధరలు కాపర్, అల్యూమినియం వైర్, కూలీల ధరలు విపరీతంగా పెరిగినప్పటికీ, నాటి రెండు సంవత్సరాల కోసం ఇచ్చిన రేట్లతో నెట్టుకు వస్తున్నామన్నారు. దీంతో తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి తోడు కార్మికుల కొరత, జీత భత్యాలు, రవాణా ఖర్చులు, కరెంట్ బిల్లులు గతంతో పోల్చి చూస్తే తేడాలో ఎన్నో రెట్లు పెరిగి కనిపిస్తున్నాయన్నారు. ఈ విషయాన్ని సంబంధిత అధికారులకు గత కొన్ని సంవత్సరాలుగా మొరపెట్టుకుంటున్నా, స్పందించక పోవడంతోనే సమ్మెకు దిగామన్నారు. తమ సమస్యలను వినకుండా అడ్డగోలు నిబంధనలు అమలు చేయడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో 18 జిల్లాల్లోని ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు షెడ్డులను మూసి వేసినట్లు చెప్పారు. విద్యుత్ వినియోగదారులు, రైతులకు కలుగుతున్న అసౌకర్యానికి క్షమించాలని, తాము పడుతున్న ఇబ్బందులను సహృదయంతో అర్థంచేసుకోవాలని విన్నవించారు.

నేడు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

రఘునాథపల్లి: మండల వ్యాప్తంగా నేడు(సోమవారం) 1 నుంచి 19 ఏళ్ల లోపు పిల్లలందరికి నులి పురుగుల నివారణ మాత్రలు వేయనున్నట్లు రఘునాథపల్లి వైద్యాధికారి స్రవంతి తెలిపారు. ఆదివారం ఆమె వైద్య సిబ్బందితో జరిగిన సమావేశంలో మాట్లాడారు. మండలంలోని 9,191మంది పిల్లలకు మాత్రలు వేయనున్నట్లు తెలిపారు. సోమవారం అందుబాటులో లేని వారికి ఈ నెల 18వ తేదీన మాత్రలు వేయనున్నట్లు పేర్కొన్నారు. మాత్రలే వేసేందుకు అన్ని రకాల ఏర్పాట్లు పూర్తయ్యాయని, నులిపురుగుల నిర్మూలనకు అల్బెండజోల్ మాత్రలు బాధ్యతగా వేయాలని ఆమె సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో కమ్యూనిటి హెల్త్ ఆఫీసర్ రామ్‌కిషన్, సూపర్‌వైజర్లు సుజనా రజని, సులోచన, విష్ణువర్ధన్‌రెడ్డి, పాండరి, వేణుగోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

పాలకుర్తి టౌన్: నులిపురుగు నివారణతో పిల్లలకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని మండల వైద్యాధికారి డాక్టర్ సిద్ధార్థరెడ్డి అన్నారు. సోమవారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల్లో 01 నుంచి 19 సంవత్సరాల లోపు 12,197 మంది పిల్లలకు ప్రభుత్వ పాఠశాలల్లో, అంగన్‌వాడీ స్కూళ్లలో ఆశ కార్యకర్తలతో విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను వేయనున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు.

దేవాదుల సృష్టికర్త అని చెప్పుకోవడం సరికాదు


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య

- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య

జఫర్‌గఢ్: తట్టెడు మట్టి తీయని ఎమ్మెల్యే కడియం శ్రీహరి దేవాదుల సృష్టికర్త అని చెప్పుకోవడం సరికాదని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య తీవ్ర స్థాయిలో విమర్శించారు. మండలంలోని సాగరం గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేవాదుల ద్వారా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇప్పటి వరకు దేవాదుల ద్వారా ఏ ఒక్క చెరువు, కుంటను నింపలేదన్నారు. నియోజకవర్గానికి రూ.800 కోట్లు ఖర్చు చేసినట్లు శ్రీహరి అబద్ధపు ప్రచారం చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. కాగా, మండలంలోని దుర్యానాయక్‌తండా, కోనాయిచలం, సాగరం, తిడుగు గ్రామాల్లో ఊరూరుకి బీఆర్ఎస్ సంక్షేమాలు, ఇంటింటికి కేసీఆర్ పథకాలపై ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల ఇన్‌చార్జ్ పసునూరి మహేందర్‌రెడ్డి, ఆకుల కుమార్, మారపాక రవి, కడారి శంకర్, మారపల్లి కరుణాకర్, నాయకులు పాల్గొన్నారు.

సిమెంట్ బెంచీల అందజేత


దాతలను సన్మానిస్తున్న గ్రామస్తులు

తరిగొప్పుల: మండలంలోని నర్సాపూర్ గ్రామంలో ప్రధాన కూడలి, దేవాలయాలు ఆవరణలో ప్రజల సౌకర్యార్థం మండలకేంద్రానికి చెందిన బీఆర్ఎస్ జిల్లా నాయకుడు ఎడెల్లి శ్రీనివాస్‌రెడ్డి, గ్రామానికి చెందిన గుంటి బంటి, గుంటి రాములు, మరియపురం గ్రామానికి చెందిన తిరుమల్‌రెడ్డి భాస్కర్‌రెడ్డికు రూ.60వేల విలువగల 20 సిమెంట్ బెంచీలను అందజేశారు. ఈ సందర్భంగా దాతలను గ్రామస్తులు ఆదివారం శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో గుంటి గట్టయ్య, ఇరుమల్ల సమ్మయ్య, రమేష్, చిక్కొండ మహేష్, గుంటి కనకయ్య, ఎంగల గంగయ్య, బెల్లం రాజు,నర్సయ్య, గట్టు మల్లయ్య, ఇరుమల్ల గట్టయ్య, కోటి లింగం తదితరులు పాల్గొన్నారు.

చెక్‌డ్యామ్‌లకు జలకళ


కడవెండి వాగులో వర్షపు నీటితో నిండిన చెక్‌డ్యామ్

దేవరుప్పుల: మొన్నటి వరకు వర్షపు చుక్క లేక వేసవిని తలపించేలా కనిపించిన వాగు పరివాహక ప్రాంతాల్లో వరుణుడి కరుణతో చెక్‌డ్యామ్‌లు నిండుతూ జలకళను సంతరించుకుంది. దేవరుప్పుల మండలం కోలుకొండ నుంచి గొల్లపల్లి వాగు పరివాహక ప్రాంతం పారితినే సుమారు 20 గ్రామాలకు భూగనర్భజలాలు పెంపొందే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఈ తరుణంలోనే వ్యవసాయ బోర్లపై ఆధారపడిన అన్నదాతలు ప్రకృతిపై ఆధారపడి వరిసాగు చేస్తే మడులు నెర్రలు పారే స్థితికి చేరుకున్నాయి. గత మూడు రోజులుగా ఆడపడపా కురుస్తున్న వర్షాలకు వాగుల్లోకి వరద నీరు చేరి చెక్‌డ్యామ్‌లు నిండుతూ కిందికి పారడంతో ఆదివారం రాత్రి వరకూ దేవరుప్పుల చెక్‌డ్యామ్ పొర్లడంతో వాగు పరివాహక రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

జనగామ: క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందని పట్టణంలోని 12వ వార్డు మాజీ కౌన్సిలర్ గుర్రం భూలక్ష్మినాగరాజు అన్నారు. ఆదివారం పట్టణంలో 11, 12 వార్డు యువకులకు నిర్వహించే క్రికెట్ క్రీడలను ప్రారంభించారు. అనంతరం కౌన్సిలర్ మాట్లాడుతూ 2008 నుంచి వీవర్స్ కాలనీ 11, 12వ వార్డు యువకులకు ఈ క్రీడలను నిర్వహిస్తున్నామని, గెలుపొందిన వారికి స్వాతంత్ర్య దినోత్సవం రోజున బహుమతులు అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు చిదురాల గణేష్, గుర్రం ఉపేందర్, వెంకటయ్య, నర్సింహులు, మల్లికార్జున్, మహేందర్, ప్రభాకర్, ఉదయ్, అరుణ్, చంద్రశేఖర్, శంకర్, శ్రీకాంత్ కాలనీవాసులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం


పట్టుకున్న ట్రాక్టర్‌తో పోలీసులు

రఘునాథపల్లి: మండలంలోని బానాజీపేట–కుందారం వాగు నుంచి ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై దూదిమెట్ల నరేష్ ఆదివారం తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ సిహెచ్ కుమారస్వామి, కానిస్టేబుల్ సాయికుమార్‌లు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా కుందారం గ్రామానికి చెందిన ఓరుగంటి చిరంజీవి అనుమతులు లేకుండా ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఒకరి ఆత్మహత్య


వెంకటయ్య (ఫైల్)

రఘునాథపల్లి: మద్యానికి బానిసైన ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం బానాజీపేటలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన చాట్ల వెంకటయ్య (51) కొన్నాళ్లుగా అతిగా మద్యం తాగుతూ కుటుంబ సభ్యులతో గొడవపడుతుండేవాడు. మద్యానికి బానిసైన వెంకటయ్య జీవితంపై విరక్తి చెంది శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గుర్తించి వెంటనే వరంగల్ ఎంజీఎంకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతురాలి భార్య సుగుణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దూదిమెట్ల నరేష్ తెలిపారు.

ఆర్థికసాయం



బచ్చన్నపేట: మండలంలోని గోపాల్‌నగర్ గ్రామానికి చెందిన భవన నిర్మాణ రంగ కార్మికుడు గంగరబోయిన భిక్షపతి (45) మృతి చెందగా తోటి కార్మికులు ఆదివారం ఆర్థిక సాయాన్ని అందించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృత దేహంపై పూల మాల వేసి నివాళులర్పించి రూ. 10 వేల సాయం అందించారు. ఆ సంఘం పట్టణ అధ్యక్షుడు గందమల్ల కిష్టయ్య, రాగీరు సత్యనారాయణ, అల్వాల రాజు, ఎల్లయ్య, నాగరాజు, రామచంద్రం, నరేష్, మహేష్, శ్రీనివాస్, జంపయ్య, మహేందర్, పాండురంగం, పుల్లయ్య పాల్గొన్నారు.

విద్యుత్‌కు అంతరాయం


విద్యుత్ వైర్లపై కూలిన చెట్టు

పాలకుర్తి: విద్యుత్ స్తంభంపై చెట్టు విరిగిపడటంతో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. ఆదివారం కురిసిన వర్షానికి విస్నూరులో కరెంట్ వైర్లపై చెట్టు విరిగి పడటంతో వైర్లు తెగి కిందపడ్డాయి. దీంతో గ్రామంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఈ విషయాన్ని విద్యుత్ డీఈ రాంబాబు దృష్టికి గ్రామస్తులు తీసుకెళ్లగా సరఫరా పునరుద్ధరించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. డీఈ ఆదేశాల మేరకు లైన్‌మన్ రాజలింగం గ్రామానికి చేరుకుని విద్యుత్ సరఫరా అయ్యేవిధంగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

ప్రకృతి కరుణ కోసమే తీజ్ ఉత్సవాలు


తీజ్ ఉత్సవాల్లో లక్ష్మీనారాయణనాయక్

దేవరుప్పుల: ప్రకృతి కరుణ కోసమే బంజరా మహిళలు తీజ్ ఉత్సవాలు నిర్వహిస్తారని ప్రముఖ వైద్యులు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు డాక్టర్ లకావత్ లక్ష్మీనారాయణనాయక్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని పడమటితండా(పెద్దతండా) పరిధి దొనెబండ తండాలో నిర్వహించిన తీజ్ వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. తరతరాల నుంచి వస్తున్న బంజారా సంస్కృతి సాంప్రదాయాలను రక్షించడం కోసం పాటుపడాలన్నారు. గ్రామ అధ్యక్షుడు గుగులోత్ నర్సింహ, ఉపాధ్యక్షుడు బానోత్ వెంకన్న, కంటెస్టెంట్ ఎంపీటీసీ రమేష్, భాస్కర్, సంతోష్ రాజు, సురేందర్,నునావత్ నరసింహ, యాకన్న, నరేష్ దళపతి పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం


కల్యాణోత్సవంలో ట్రస్ట్ చైర్మన్ దంపతులు, భజన మండలి బృందం

రఘునాథపల్లి: మండల కేంద్రంలోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో కొనసాగుతున్న పంచదశ వార్షికోత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. ఎల్ బీబీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ లగిశెట్టి భిక్షపతి–రాజమణి దంపతుల ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్ఛరణాలతో శివలింగ ప్రతిష్ఠ చేశారు. అనంతరం ఆలయం ముందు ఒకే మండంపై ప్రత్యేకంగా అలంకరించిన కల్యాణ వేదికపై శివపార్వతుల కల్యాణం, శ్రీ వేంకటేశ్వర కల్యాణం, శ్రీ సీతారామ కల్యాణం, శ్రీ ఆంజనేయ స్వామి కల్యాణం మంగళ వాయిద్యాలతో స్వాముల కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీరామదాసు భజన మండలి తెలుగు రాష్ట్రాల సేవా సొసైటీ నిర్మల్ జిల్లా మస్కాపూర్ భజన బృందం భజనలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా భక్తులకు మహాన్నదానం చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు గంగాదర్, జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టికల్ 25ను అన్ని కులాలకు వర్తింపజేయాలి


నిరసన తెలుపుతున్న ఆర్ఎఫ్‌డీ బాధ్యులు

చిల్పూరు: 1950 ఆగస్టు 10వ తేదీన రాష్ట్రపతి ఉత్తర్వులోని 3వ పేరాను తొలగించి రాజ్యాంగం కల్పించిన ఆర్టికల్ 25 మతస్వేచ్ఛను అన్ని కులాలకు వర్తింపజేయాలని ఆర్ఎఫ్‌డీ(రిలీజియస్ ఫ్రీడమ్ ఫర్ దళిత్) గ్రామ అధ్యక్షుడు రాజేందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 తో క్రైస్తవ దళితులకు తీవ్రంగా అవమానించడం జరుగుతుందంటూ దేశవ్యాప్త నిరసనలో భాగంగా ఆదివారం నష్కల్ గ్రామంలోని చర్చి వద్ద క్రైస్తవ సంస్థలు, సంఘాలు ప్లకార్డుల నిరసన చేపట్టాయి. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ దళితులకు మత స్వేచ్ఛ కల్పించాలని, దళితలకు వేసిన మతసంకెళ్లు తొలగించాలన్నారు. రంగనాథ్ మిశ్రా కమిషన్ అమలు చేయాలన్నది డిమాండ్ అన్నారు. కార్యక్రమంలో అనీల్, ప్రకాశం, జాకార్య, బాలస్వామి, శ్రీనివాస్, పీటర్, యోనా, శాగంటి మణి తదితరులు పాల్గొన్నారు.

గోదావరి జలాలతో చెరువులు నింపాలి


మాట్లాడుతున్న సతీష్‌రెడ్డి

బచ్చన్నపేట: మండలంలోని చెరువులు, కుంటలను గోదావరి జలాలతో నింపాలని సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు గంగం సతీష్‌రెడ్డి కోరారు. ఆదివారం బొమ్మకూర్ రిజర్వాయర్‌ను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ వర్షాలు సరిగా కురియక అన్నదాతలు అవస్థలు పడుతున్నారని అన్నారు. భూగర్భ జలాలు అడుగంటి బోర్లు, బావుల ద్వారా నీరు రావడం లేదని, ఇలాగే కొనసాగితే వచ్చే సీజన్‌లో సేద్యం చేయడం కష్టమవుతుందన్నారు. రిజర్వాయర్‌లో లెవల్ వటర్ ఉన్నా గత కొన్ని రోజులుగా పంపింగ్ చేయడం లేదని మోటర్లను ఆన్ చేయలేదన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మోటర్లు ఆన్ చేసి చెరువులు, కుంటలను నింపాలని పూర్తి స్థాయిలో మోటర్లు ఆన్ చేయాలని కోరారు. కార్యక్రమంలో మిన్నాలపురం కనుకయ్య, సిద్దయ్య, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పోచమ్మ తల్లి బోనాలు


జనగామ రూరల్: శామీర్‌పేటలో బోనాలతో ముదిరాజ్ కులస్తులు


జనగామ: టీఎన్జీఓ కాలనీలో పోచమ్మ ఆలయానికి విరాళం అందజేస్తున్న ధనలక్ష్మి శ్రీకాంత్ దంపతులు


బచ్చన్నపేట: తమ్మడపల్లిలో బీరప్పగుడిలో..


జనగామ: బోనాలతో వెళ్తున్న మహిళలు

శ్రావణ మాసం పురస్కరించుకొని గ్రామాల్లో పోచమ్మతల్లి బోనాల పండుగను ఆయా సామాజిక వర్గాలు ఆదివారం ఘనంగా నిర్వహించాయి. ఈ సందర్భంగా డప్పు చప్పుళ్ల మధ్య బోనాలతో ఆలయాలకు చేరుకుని పోచమ్మతల్లికి, బీరప్పకు నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. పాడి పంటలు బాగా పండి చల్లంగా ఉండాలని వేడుకున్నారు.

– సాక్షి నెట్‌వర్క్


స్టేషన్‌ఘన్‌పూర్: శివునిపల్లి పోచమ్మగుడి వద్ద మొక్కులు చెల్లిస్తున్న విశ్వబ్రాహ్మణులు


రఘునాథపల్లి: ఇబ్రహీంపూర్‌లో..


స్టేషన్‌ఘన్‌పూర్: పోచమ్మగుడి వద్ద బోనాలతో మహిళలు


లింగాలఘణపురం: బీరప్పకు బోనాలు తీసుకెళ్తున్న కురుమ కులస్తులు


దేవరుప్పుల: కడవెండిలో..

ధ్యానంతో జీవితంలో అనేక మార్పులు


మాట్లాడుతున్న వంశీకిరణ్

జనగామ రూరల్: ధ్యానంతో జీవితంలో అనేక మార్పులు వస్తాయని, ప్రతీఒక్కరు ధ్యానం చేయాలని పిరమిడ్ రాష్ట్ర ప్రతినిధి భీమినేని వంశీ కిరణ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని క్లాం రోడ్డు మార్కండేయ స్వామి దేవాలయం పద్మశాలి కల్యాణ మండపంలో పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీస్ వంగాల రాజేందర్ అధ్యక్షతన ఉచిత ధ్యాన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ధ్యానం విశిష్టతను, శాఖాహారం ప్రాముఖ్యతను, ప్రతికూల పరిస్థితుల్లో ధ్యానం ఏవిధంగా రక్షిస్తుందో వంశీకిరణ్ తెలియజేశారు. కార్యక్రమంలో రవీందర్, వీరస్వామి, సత్యనారాయణ, భాస్కర్, సంజీవ, ఆనంద్ దాలియా, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.